కొనలేం.. తినలేం

- ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు
- తగ్గిన ఉత్పత్తితో పెరిగిన డిమాండ్
- వినియోగదారులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న స్టాల్స్
- ఆకుకూరలకూ డిమాండ్



వినియోగదారులు లేక బోసిపోయిన తిరువూరు రైతుబజారు (ఇన్‌సెట్) రైతుబజారులో విక్రయానికి సిద్ధంచేసిన కూరగాయలు

తిరువూరు/నూజివీడు: నిన్నమొన్నటి వరకు అందుబాటులో ఉన్న కూరగాయల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటుతున్నాయి. ఒక పక్క పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో మధ్య, దిగువ తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతుండగా వాటికి తోడుగా కూరగాయల ధరలు కూడా పెరుగుతుండటంతో పేదలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇటీవల కిలో రూ.25కు లభించిన కూరగాయలు నేడు రూ.60 దాటాయి. దీంతో పేదలు కూరగాయలు కొనాలంటేనే వామ్మో అనాల్సిన పరిస్థితి. ప్రస్తుతం టమాటా, వంకాయలు, బెండ, దొండ, బీర, సొర, పొట్ల, చిక్కుడు, దోస ఇలా ఏ కూరగాయలు చూసినా ధరల మోత మోగుతుండటంతో ఏమి కొనాలి, ఏమి తినాలి అంటూ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రూ.200 తీసుకువెళ్లి మార్కెట్‌లో కూరగాయలు కొన్నా సంచిలో సగానికి కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 రోజుల కిందట ఉన్న ధరలకు, ఈరోజు ఉన్న ధరలకు మధ్య భారీ వ్యత్యాసం ఉండటం, ధరలు రోజురోజుకు పెరిగిపోతుండటంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రైతు బజారులో ధరలే అదిరిపోతుండగా గ్రామాల్లో, మండల కేంద్రాలలో ఉన్న కూరగాయల దుకాణాల్లో ధరలు రైతు బజారుల ధరల కంటే రెట్టింపు ధర పలుకుతూ మరింత తారెత్తిస్తున్నాయి. ఒకవైపు పప్పులు కొనలేక, మరోవైపు కూరగాయలు కొనలేక పచ్చడి మెతుకులతో ప్రజలు కడుపు నింపుకుంటున్నారు.

ఎండల తీవ్రతతో తగ్గిన ఉత్పత్తి..

వేసవి ఎండల తీవ్రత కారణంగా వినియోగానికి తగినంత ఉత్పత్తి లేకపోవడంతో కూరగాయలకు విపరీతమైన కొరత ఏర్పడింది. వర్షాభావ పరిస్థితులతో గత ఆరు నెలల్లో కూరగాయలను పొలాల్లో, పెరటితోటల్లో పెంపకం చేపట్టిన రైతులు దిగుబడులు రాక, మొక్కలు ఎండిపోయి తీవ్ర నష్టాలు చవిచూశారు. తిరువూరు డివిజన్‌లోని 16 గ్రామాల్లో కూరగాయలు, ఆకుకూరలను సాగుచేసే రైతులు పెట్టుబడులు సైతం రాక వెనక్కు తగ్గారు. తిరువూరు రైతుబజారులో సమీప రైతులు సరఫరా చేసే కూరగాయలు లేక విజయవాడ నుంచి దిగుమతి చేసుకుని వినియోగదారులకు విక్రయిస్తున్నారు. గత పది రోజుల నుంచి కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు పచ్చడి మెతుకులతో సరిపెట్టుకోవలసిన పరిస్థితి నెలకొంది. అధికశాతం వినియోగదారులు కొనుగోలు చేసే టమాటా ధరల నియంత్రణకు ప్రభుత్వం సబ్సిడీ ధరకు రైతుబజార్లలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి టమాటాలను విక్రయించాలని యోచిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సరఫరా తగ్గింది

వేసవి ఎండల తీవ్రతతో కూరగాయల దిగుబడి బాగా తగ్గింది. రైతులు వర్షాలు పడితే మళ్లీ కూరగాయలు సాగు చేపట్టే అవకాశం ఉంది. మరో నెల రోజుల వరకు కూరగాయలకు కొరత ఉండవచ్చు.

– చిట్టిబాబు, తిరువూరు రైతుబజారు ఎస్టేట్ అధికారి

మండుతున్న కూరగాయల ధరలు

మార్కెట్లో కూరగాయలకు డిమాండ్ పెరగడంతో వ్యాపారులు ధరలను విపరీతంగా పెంచేశారు. రైతుబజారులలో టమాటా కిలో రూ.70 వరకు ఉండగా, బయటి మార్కెట్లో రూ.100 నుంచి రూ.120కి విక్రయిస్తున్నారు. మిర్చి, చిక్కుడు, బీర, కాకర కిలో రూ.80 నుంచి రూ.100 వరకు, బీన్స్ కిలో రూ.150, దుంపలు కిలో రూ.60 చొప్పున అమ్ముతున్నారు. బీరకాయలు, బెండ, దొండ, వంకాయల ధరలూ అందనంత ఎత్తులో ఉన్నాయి. ఆకుకూరల ధరలు ఇష్టానుసారం పెంచేస్తున్నారు. గతంలో కట్ట రూ.10 ఉండగా, ప్రస్తుతం రూ.20కి విక్రయిస్తున్నారు. ఉదయం 10 గంటల లోపే స్టాల్స్‌లో కూరగాయలు ఖాళీ అయిపోతున్నాయి. తిరువూరులోని సర్దార్ పేట బాపయ్య నగర పంచాయతీ కూరగాయల దుకాణం, గంపలగూడెం, విస్సన్నపేటలలోని ప్రైవేటు దుకాణాల్లో అరకొరగానే కూరగాయల అమ్మకాలు జరుగుతున్నాయి.

సంక్రాంతి నాటికి టిడ్కో ఇళ్లు అందజేస్తాం

మంత్రి పార్థసారథి



నూజివీడు: రానున్న సంక్రాంతి నాటికి నూజివీడు పట్టణంలోని లబ్ధిదారులకు కనీసం వెయ్యి టిడ్కో గృహాలను అందించేందుకు కృషి చేస్తామని గృహ నిర్మాణ శాఖ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు పట్టణంలోని టిడ్కో గృహాలను గురువారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019కు ముందు టీడీపీ ప్రభుత్వం నిరుపేదలకు పక్కా గృహాలు అందించాలన్న లక్ష్యంతో టిడ్కో గృహాలను నిర్మించిందని, వాటిలో చాలావరకు 90 శాతం పూర్తి చేసిందని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు టిడ్కో ఇళ్లను ఏడాదిన్నర కాలంలో పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామన్నారు. మొత్తం 2,640 ఇళ్లకు సంక్రాంతి నాటికి కనీసం వెయ్యి ఇళ్లు లబ్ధిదారులకు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడ్కో పీడీ బి.చిన్నోడు, డీఈ శాంతకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా రెవెన్యూ దినోత్సవం



ఆగిరిపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ విశ్రాంత ఉద్యోగి కడార్ల పుల్లయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్ కుమార్, వీఆర్వోలు పత్తిపాటి శ్రీను, వంశీ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు దివ్యాంగుల నిర్ధారణ శిబిరం

నూజివీడు: దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను ఉచితంగా అందించేందుకు ఈనెల 22న స్థానిక ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేశామని డీవైఈఓ ఎం. సేవియా తెలిపారు. నూజివీడు పట్టణం, నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాలకు చెందిన 18 ఏళ్ల లోపు వయస్సు గల దివ్యాంగులు పాల్గొనవచ్చన్నారు. ఆధార్, రేషన్‌కార్డు, సదరం సర్టిఫికెట్, రెండు పాసుపోర్టు సైజ్ ఫొటోలు వెంట తెచ్చుకోవాలన్నారు. ఈ శిబిరాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యోగాతో ఆరోగ్యం



నూజివీడు: నిత్యం యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని గొల్లపల్లి హైస్కూల్ హెచ్ఎం పొట్లూరి రాధికారాణి అన్నారు. నూజివీడు మండలం గొల్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు గురువారం యోగా పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో హాసిని, దివ్యరాణి, మునీర్, శివచరణ్, సీనియర్ విభాగంలో పల్లవి, జాహ్నవి, హర్ష, మణికంఠ ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచారు. వీరికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కల్యాణమస్తు' అందజేత



అక్కపాలెం(తిరువూరురూరల్): మండలంలోని అక్కపాలెంలో కృష్ణా మిల్క్ యూనియన్‌కు పాలు సరఫరా చేసే రైతు కుమారుడి వివాహానికి కల్యాణమస్తు పథకం కింద బంగారు ఉంగరాన్ని గురువారం అందజేశారు. గ్రామానికి చెందిన కంచిపోగు చిన్న వెంకటేశ్వరరావు కుమారుడు శ్రీనివాసరావు వివాహం సందర్భంగా తిరువూరు క్లస్టర్ మేనేజరు టి. సాంబశివరావు బంగారు ఉంగరాన్ని అందజేశారు. గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాధ్యక్షురాలు కీసర కృష్ణవేణి, సభ్యులు పాల్గొన్నారు.

కౌలు కార్డులు, వ్యవసాయ రుణాలు అందించాలి



ముసునూరు: కౌలు రైతులందరికీ కౌలు కార్డులు, వ్యవసాయ రుణాలు మంజూరు చేయాలని రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం రైతు నాయకులతో కలిసి మండల రెవెన్యూ కార్యాలయం వద్ద డెప్యూటీ తహసీల్దార్ ఎమిలీ కుమారికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కాలానికి పంట రుణాలు మంజూరు చేయాలని, రైతులకు రుణమాఫీ అవకాశం కూడా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మడుపల్లి నాగేంద్రరావు, కూచిపూడి నాగేశ్వరరావు, కోనేరు సురేష్ చంద్ర బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

చీఫ్ ఇంజనీర్ శ్రీధర్‌కు సన్మానం



ఇబ్రహీంపట్నం(మైలవరం): ఏపీ జెన్‌కో ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ నూతన చీఫ్ ఇంజినీర్‌గా పీడీవీ బాధ్యతలు చేపట్టిన బొడ్డు శ్రీధర్‌ను డాక్టర్ ఎన్టీటీపీఎస్ బ్రాంచ్ ఏపీ ఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గురువారం కలిసి అభినందనలు తెలిపారు. బ్రాంచ్ ప్రెసిడెంట్ ఎం. ఉమా విజయచంద్ ఆధ్వర్యంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు శ్రీధర్‌ను తన కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ జి.సాల్మన్ శాస్త్రి, లైజన్ ఆఫీసర్ సీహెచ్‌వీఎస్ సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యప్రసాద్, నాగమల్లేష్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివి అభివృద్ధి సాధించాలి


లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్‌లో బ్యాగులతో విద్యార్థులు


పాఠ్యపుస్తకాలు అందుకున్న ముసునూరు హైస్కూల్ విద్యార్థులు


చంద్రాలలో పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ జ్యోతి

చంద్రాల(మైలవరం): విద్యార్థులు క్రమశిక్షణతో చదివి అభివృద్ధి సాధించాలని మాజీ ఎంపీపీ జొన్నలగడ్డ గంగాధరరావు అన్నారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఉచిత పాఠ్య పుస్తకాలను అందజేశారు. గంగాధరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కల్పించారని, మంచి విద్యా బోధనతోపాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందిస్తున్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ జొన్నలగడ్డ జ్యోతి చేతుల మీదుగా ఉచిత పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరద శ్రీనివాసరావు, ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఇందిరా ప్రియదర్శిని, సుంకరశెట్టి శ్రీనివాసరావు, పీఎంసీ విద్యా కమిటీ చైర్మన్ వి. మహాలక్ష్మి, ఎం. దుర్గారావు, ఉమామహేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

లక్ష్మీపురం(తిరువూరురూరల్): నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా మండలంలోని లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్‌లో గురువారం విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. సర్పంచి గొల్లమందల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ బ్యాగులను విద్యార్థులకు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. హరికృష్ణ, ఉపాధ్యాయులు సుజాత, కుమారి, పద్మలత, శ్యామల పాల్గొన్నారు.

- **ముసునూరు:** స్థానిక జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం వాణికుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్ చేతుల మీదుగా గురువారం పాఠ్య పుస్తకాలు, కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు విజయలక్ష్మి, పేరం కృష్ణ, ఎంపీటీసి చీలి లక్ష్మి, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు దేవినేని వరప్రసాద్, లక్ష్మణరావు, శ్రీనివాస్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడులో మంత్రి పార్థసారథి పర్యటన

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు పట్టణంలో గురువారం ఆయన పర్యటించారు. ఎన్టీఆర్ కాలనీలో మంచి నీటి బోరు మరమ్మతులకు గురైందని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకురావడంతో శుక్రవారం ఉదయం నాటికి వినియోగంలోకి తేవాలని మునిసిపల్ అధికారులను మంత్రి ఆదేశించారు. అదే కాలనీలోని షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారు తాము పన్నులు చెల్లిస్తున్నామని, తమ ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని కోరగా వెంటనే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు మంత్రి సూచించారు. డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అధికారులకు సూచించారు.

చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో మురుగుతో నిండిన డ్రెయినేజీని పరిశీలించి తక్షణమే పూడిక తీయించాలని మునిసిపల్ డీఈ లక్ష్మీనారాయణను మంత్రి ఆదేశించారు. ఎంప్లాయీస్ కాలనీ ఇండోర్ స్టేడియం అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను కోరారు.

అధ్యాపకుని రీసెర్చ్‌కి రూ. 5 లక్షలు మంజూరు


జె. రాముడు, అధ్యాపకులు

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జె.రాముడుకి ఆర్‌యూఎస్ఏ రూ. 5 లక్షల నిధులను రీసెర్చ్ ప్రాజెక్టుకు మంజూరు చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇల్లా రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి కళాశాలలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ రవి మాట్లాడుతూ వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ రాముడు తూర్పు కనుమలలోని ఆర్కిడ్ మొక్కల గుర్తింపు, వాటిపై అధ్యయనం అనే అంశంపై పరిశోధన చేసేందుకు గాను ఈ నిధులను మంజూరు చేశామని తెలిపారు. పరిశోధన కాలపరిమితి రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. ఈ పరిశోధన ద్వారా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలోని తూర్పు కనుమల అడవుల్లో లభ్యమయ్యే అంతరించి పోతున్న ఆర్కిడ్ మొక్కలను గుర్తించి వాటిని కాపాడే అంశాలపై అధ్యయనం చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు రాముడును వృక్ష శాస్త్ర అధ్యాపకులు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. రంగారావు, కామర్స్ అధ్యాపకులు ఎం.శ్రీనివాసరావు, తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎస్. దేవానందకుమార్, ఇతర అధ్యాపకులు అభినందించారు.

నేటి నుంచి శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేం చేసిన పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి వార్ల దేవస్థాన త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్. అప్పారావు, మరుపిళ్ళ హనుమంతరావు తెలిపారు. దేవస్థాన అవరణలోని కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బ్రహ్మోత్సవాల వివరాలను పాలక మండలి వివరించింది. ఉత్సవాలను టీటీడీ వేద పాఠశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మురికిపూడి మణిదీప్‌కుమార్, ప్రధాన అర్చకులు వినుకొండ రత్నమాచార్యులు శ్రీనివాసుని గోపాల్ పర్యవేక్షణలో నిర్వహించనున్నామని చెప్పారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో తొలి రోజున స్వామి వారికి మంగళస్నానాలు, నూతన వధూవరులుగా అలంకరణ చేస్తామని పేర్కొన్నారు. రెండో రోజు హోమాలు, నవగ్రహ ఆరాధన, సహస్ర దీపాలంకరణ సేవ జరుగుతుందన్నారు. 23వ తేదీన స్వామి వారి కల్యాణోత్సవం, 24వ తేదీన స్వామి వారికి పుష్పయాగం, సాయంత్రం నగరోత్సవ సేవ ఉంటుందని తెలిపారు. 25వ తేదీ శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రధాన మూర్తికి పంచామృత అభిషేకాలు, పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. సాయంత్రం పవళింపు సేవ జరుగుతుందన్నారు. స్వామి వారికి నిర్వహించే విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలో పాల్గొనాల్సిందిగా భక్తులందరికీ ఆహ్వానం పలుకుతున్నామన్నారు.

సమావేశంలో కమిటీ కోశాధికారి పిల్లా శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు బెవర సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, పొట్నూరి రాజా, పిల్లా విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి ఈఓ, ఏఈఓల మధ్య వాగ్వాదం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఈఓ కేఎస్ రామరావు, ఏఈఓ సుధారాణిల మధ్య గురువారం వాగ్వాదం చోటు చేసుకుంది. ఉదయం హుండీ లెక్కింపు సమయంలో చోటు చేసుకున్న ఈ ఘటన ఆలయంలో చర్చనీయాంశంగా మారింది. అమ్మవారి బంగారు ఆభరణాలను మహా మండపం 7వ అంతస్తులోని ఎస్పీఎఫ్ సిబ్బంది కార్యాలయం సమీపంలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తారు. ఇటీవల బంగారు ఆభరణాలను పూర్వ ఈఓ నుంచి అప్పగించుకునే క్రమంలో తూకంలో వ్యత్యాసం ఉందంటూ ఏఈఓ సుధారాణి పేర్కొంటున్నారు. దీనిపై ఏఈఓ సుధారాణి ఈఓకు, దేవదాయ శాఖ ముఖ్య అధికారులకు లేఖ రాయడమే ఈ వివాదానికి కారణంగా తెలుస్తోంది. ఈ లేఖను గురువారం ఈఓ రామరావుకు లేఖ ఇవ్వడమే కాకుండా దాని కాపీలను దేవదాయ శాఖ అధికారులకు పంపుతున్నట్లు ఉంది. దీనిపై ఎక్కడ లోపం జరిగిందనే దానిని గుర్తించిన తర్వాతే కమిషనర్ కార్యాలయానికి తెలియజేస్తే బాగుంటుందని ఈఓ పేర్కొనడంతో ఇద్దరి మధ్య వాదన చోటు చేసుకున్నట్లు తెలుస్తుంది.

సంతృప్తినిచ్చే సేవలు అందించాలి


ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న శంకర్ గుప్తా, హజరత్తయ్య గుప్తా, సూర్యనారాయణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): తటవర్తి వరలక్ష్మి సూర్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఐదుగురు దివ్యాంగులు (విభిన్న ప్రతిభావంతులు)కు అవసరమైన ట్రైసైకిళ్లు, కృత్రిమ అవయవాలను అందజేయడం అభినందనీయమని పలువురు లయన్స్ క్లబ్ ప్రతినిధులు అన్నారు. విజయవాడలోని ట్రస్ట్ కార్యాలయంలో గురువారం ట్రైసైకిళ్లతోపాటు 20 మందికి వినికిడి మిషన్లు వితరణ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా లయన్స్ జిల్లా గవర్నర్ జీఎస్ శంకర్ గుప్తా, లయన్స్ డిజిగ్నేటెడ్ అంబాసిడర్ వేముల హజరత్తయ్య గుప్తా, మాజీ గవర్నర్ దుర్గామల్లేశ్వరరావు పాల్గొని ట్రస్ట్ సేవలను కొనియాడారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె. రామలింగేశ్వరరావు, రవీంద్ర కుమార్ మాట్లాడుతూ దాత, విలాస్ బనియన్స్ అధినేత తటవర్తి సూర్యనారాయణ అందిస్తున్న సేవలు మరువురానివని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ తాను వాసవి క్లబ్ జిల్లా గవర్నర్‌గా పని చేసినప్పుడు 108 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు తయారు చేయించి ఇచ్చినప్పుడు వారి కళ్లల్లో కనిపించిన ఆనందం నేటికీ మరిచిపోలేనిదన్నారు. మనం చేసే సేవలు లబ్ధిదారులకు ఉపయోగపడటమే కాకుండా సంతృప్తినిచ్చేదై ఉండాలని పేర్కొన్నారు. ట్రస్ట్ సభ్యులు చంద్రశేఖర్ మాట్లాడుతూ పేదలకు, దివ్యాంగులకు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

తద్వారా వారి కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండటంకంటే ఇంకా ఏం కావాలని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కొత్తమాసు రామ్‌కుమార్, ఐ. నాగేశ్వరరావు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి సహకరించండి


ఎంపీ కేశినేని చిన్నితో మాట్లాడుతున్న ఆత్యా పాత్యా సంఘం సీఈఓ ఆర్డీ ప్రసాద్

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ని ఆత్యాపాత్యా రాష్ట్ర సంఘం సీఈఓ ఆర్డీ ప్రసాద్ కోరారు. విజయవాడలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ చిన్నిని ఆర్డీ ప్రసాద్ గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించారు. అనంతరం రాష్ట్రంలో క్రీడల పరిస్థితిపై సుదీర్ఘంగా చర్చించారు. క్రీడా సంఘాలను ఏకతాటిపైకి తీసుకొస్తే క్రీడాకారులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర క్రీడాకారులు మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించే వీలుంటుందన్నారు. కొన్ని క్రీడా సంఘాలు పాల్పడుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అమ్మవారి సేవలు భక్తులకు చేరువ కావాలి


ఐటీ విభాగంతో మాట్లాడుతున్న ఈఓ రామరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ప్రతి నిత్యం జరుగుతున్న ఆర్జిత సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులకు మరింత చేరువ కావాలని ఈఓ కేఎస్ రామరావు ఆదేశించారు. దుర్గగుడి ఐటీ వింగ్, 9 అండ్ 9 సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులతో గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అమ్మవారికి ప్రతి నిత్యం జరిగే అన్ని రకాల ఆర్జిత సేవలు, పరోక్ష సేవలపై భక్తులకు అవగాహన కల్పించడంతో పాటు వాటిని భక్తులకు చేరువ చేసేలా డిజిటల్ మార్కెటింగ్, ఇతర ప్రచార సాధనాలను ఉపయోగించాలని సూచించారు. అనంతరం దేవస్థానం సోషల్ మీడియాలో మరింత చురుగ్గా ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఐటీ సిబ్బంది హరీష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెండు

కంచికచర్ల: పాలిటెక్నిక్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు అనేక ఉపాధి, ఉద్యోగావకాశాలు ఉన్నాయని పరిటాల అమిత్రసాయి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ అన్నారు. అమిత్రసాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ఏడాది పాలిటెక్నిక్ కోర్సులో చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కె. రామ్మోహనరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రామ్మోహనరావు, డాక్టర్ శశిధర్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి ప్రణాళికతో పాటు కళాశాలలోని ప్రయోగశాలల ద్వారా సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవచ్చన్నారు. పాలిటెక్నిక్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు నేరుగా ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. పాలిటెక్నిక్ కోర్స్ పూర్తిచేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో కూడా మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఇండియన్ ఆర్మీ, రైల్వే, ఎయిర్‌లైన్స్, ఇరిగేషన్, ట్రాన్స్‌కో సంస్థలతోపాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు పొందవచ్చని పేర్కొన్నారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎం శ్రీదేవి, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నీతిఅయోగ్ లక్ష్యాల సాధనపై సమీక్ష

పెనుగంచిప్రోలు: అన్నిశాఖల అధికారులు వారికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎం.శ్రీసాయిహర్ష సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆస్పిరేషన్ బ్లాక్ డెవలప్‌మెంట్ స్ట్రాటజీ సమీక్షా సమావేశాన్ని మండల బ్లాక్ కో–ఆర్డినేటర్ మోహన్ సందీప్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ నీతి అయోగ్ సీఈఓ సూచనల ప్రకారం ఆరోగ్యం, పౌష్టికాహారం, వ్యవసాయం, సోషల్ డెవలప్‌మెంట్ విభాగాలకు సంబంధించిన లక్ష్యాలను నూరుశాతం సాధించాలన్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీఓ కె. లక్ష్మీభార్గవి, వైద్యాధికారి పి.ఇందిర, ఏఓ కె. రామసుబ్బారెడ్డి, పీఆర్ ఏఈ సుందరరామయ్య పాల్గొన్నారు.

సవరణ

ది. 28-05-2024 సాక్షి దినపత్రిక తిరువూరు డివిజన్ పేజీలో [illegible] మెంట్ నెం. 5960/2018 [illegible]

చింతల వెంకట రెడ్డి, అడ్వకేట్, తిరువూరు ఎన్.టి.ఆర్. జిల్లా, సెల్: 94407 64148.

- **ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఇంద్ర కీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నర్తన నట రాజ నాట్యాలయానికి చెందిన చిన్నారులు గురువారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై కళాబృందానికి చెందిన చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.